క్లుప్తంగా

నిబద్ధతతో పనిచేయాలి



ఎంపీడీఓ రామారావును కలిసిన పంచాయతీ కార్యదర్శులు

నెల్లిమర్ల: ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గిడుతూరి రామారావును ఈఓపీ ఆర్‌డీ భానోజీరావు, పంచాయతీ కార్యదర్శులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పసపాం విద్యార్థి



జిల్లా స్థాయి పోటీల్లో హైజంప్ చేస్తున్న పసపాం విద్యార్థి లక్ష్మి

పూసపాటిరేగ: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పసపాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి. లక్ష్మి ఎంపికైంది. ఈ నెల 9న విజయనగరం విజ్జీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హైజంప్ విభాగంలో లక్ష్మి ప్రథమస్థానంలో నిలిచింది. ఏలూరు జిల్లా ఏఎస్సార్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మి జిల్లా తరఫున పాల్గొనుంది. ఈ మేరకు విద్యార్థిని లక్ష్మిని హెచ్‌ఎం నాగేశ్వరరావు, పీఈటీ లీలాకృష్ణ, తదితరులు అభినందించారు.

పాఠశాలకు సేఫ్టీ గేట్ల వితరణ



హెచ్‌ఎం శ్రీనివాస్‌కు సేఫ్టీ గేట్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.30 వేల విలువ చేసే మూడు సేఫ్టీ గేట్లను సోమవారం హెచ్‌ఎం శ్రీనివాస్‌కు అందజేశారు. ఇంకా పాఠశాలలో ఐదు తలుపులకు సేఫ్టీ గేట్లు అవసరమని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలియజేయగా.. త్వరలోనే అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముద్దన మరళీకృష్ణ, అడ్డగర్ల శ్రీనివాసరావు, కొండపు లక్ష్మణరెడ్డి, సుందర రమేష్, ఉపాధ్యాయులు, ముద్దన శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (సీకేఎం) అక్టోబర్ 4న నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆరోగ్యసేవలు ఎలా పొందవచ్చో వివరించాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ డాక్టర్ సమీరా, నగర పంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ డి. ఉమాభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంటా వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3న చెల్లూరులో.. 7న గుంకలాంలో.. 11న ద్వారపూడిలో.. 16న కొండకరకాంలో.. 20న మరిచర్ల.. 28న నారాయణపురం గ్రామ సచివాలయాల పరిధిలో తహసీల్దార్ బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎంపీడీఓ బృందం ఆధ్వర్యంలో ఈ నెల 30న జొన్నవలసలో.. 5న దుప్పాడలో.. 9న కోరుకొండలో.. 13న సారికలో.. 18న బియ్యాలపేటలో.. గొల్లలపేటలో 26న శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

ఫైబర్‌నెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

పూసపాటిరేగ: ఫైబర్‌నెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఎంపీడీఓ రాధికకు ఫిర్యాదు చేశారు. ప్రజలకు ఎప్పటికప్పుడు విజ్ఞానం, వినోదం అందిస్తున్న ఫైబర్ నెట్‌వర్క్ ప్రసారాలు సక్రమంగా ఇవ్వకుండా ఆపరేటర్ ఇబ్బందికి గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్‌కు మిన్నగా తీర్చిదిద్దిన రఘుమండ జెడ్పీ ఉన్నత పాఠశాల

కార్పొరేట్ కంటే మిన్నగా....

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్న సంకల్పంతో అడుగులేస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలన్నీ మారిపోయి.. కార్పొరేట్ భవనాలను తలపిస్తున్నాయి. రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 387 మంది విద్యార్థులు చదువుతున్నారు. 'నాడు – నేడు' ద్వారా పాఠశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేశారు. రూ. 40 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రహరీ దగ్గర నుంచి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నీచర్, తదితర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాల ఆవరణను పచ్చదనంగా తీర్చిదిద్దారు.

– డెంకాడ



తరగతి గదిలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన టైల్స్ రహదారి



కొత్తగా నిర్మించిన మరుగుదొడ్డి



ఆకట్టుకుంటున్న పచ్చని వాతావరణం

ప్రజారోగ్యానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

• ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 30 నుంచి అక్టోబర్ 31 వరకు మండలంలోని సచివాలయాల పరిధిలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌ఓ, ఏఎన్ఎం, పంచాయతీ సెక్రటరీలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలోని 15 సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముందుగానే ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వలంటీర్లతో కలిసి సచివాలయాల పరిధిలో ఉన్న ఆయా గ్రామాలకు వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ రోగాలతో ఇబ్బందులు పడుతున్న వ్యాధిగ్రస్తులందరూ వైద్య శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు చేసకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఎంఈఓ రమణమూర్తికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైద్యాధికారి టి. తిరుపతిస్వామినాయుడు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సీడీపీఓ ఎస్తేరురాణి, ఏపీఓ ఆదిబాబు, ఏపీఎం రమణ, ఏసీడీపీఓ తవిటినాయుడు, ఏఎన్ఎంలు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్‌లో క్లీన్ అండ్ గ్రీన్

విజయనగరం పూల్‌బాగ్: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా కొత్తపేట రోడ్డులోని మున్సిపల్ స్కూల్‌లో యాదవ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ మధు ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి. పరమేష్‌యాదవ్, ఎస్. అప్పన్న, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

డైట్ బిల్లులు చెల్లించాలి

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం, పార్వతీపురం – మన్యం జిల్లాల్లో ఐటీడీఏ పరిధిలో ఉన్న వసతిగృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు చెల్లించడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘ నాయకుడు పి. సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ సీతారాం, శివ, రామరాజు, శ్రావణి, లలిత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి



జేసీ మయూర అశోక్‌కు మట్టి వినాయకుడ్ని అందజేస్తున్న స్పార్క్ సొసైటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్పార్క్ సొసైటీ ప్రతినిధులు భవానీ పద్మనాభం, మేకా అనంతలక్ష్మి, పొట్నూరు శిరీష కోరారు. ఈ మేరకు జేసీ మయూర అశోక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రంగు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మల నిమజ్జనం వల్ల నీటి కాలుష్యం పెరిగి, జల జీవరాశులకు తీవ్ర హాని కలుగుతున్నారు. చెరువుల పరిరక్షణకు అందరూ మట్టిబొమ్మలే వాడాలని కోరారు.

ఇంటింటికీ సంక్షేమం..



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

• ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోలగట్ల కృష్ణారావు అన్నారు. మండలంలోని సారిక గ్రామంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్లలో కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ కుంభకోణాల్లో మునిగి ప్రజాధనాన్ని లూటీ చేసిందని, అటువంటి నేతలను తరిమి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వైద్యం, విద్య రంగాలకు ప్రాధాన్యం

భవిష్యత్‌తరాల అభివృద్ధికి విద్యే ప్రధానమని గుర్తించి ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్యా విధానానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అప్పలనాయుడు, కృష్ణారావు అన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ నాడు ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు ఉచిత వైద్యం అందిస్తే.. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వైద్యం, వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి అత్యాధునికమైన వైద్య సదుపాయాలతో వైద్యం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రూ.8,480 కోట్లతో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. అలాగే 48,693 వైద్యాధికారులు, సిబ్బందిని నియమించారని, వైద్య రంగానికి రూ. 60 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, మండల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు రెండో విడత ప్రారంభం



మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడలో మిషన్ ఇంద్రధనుస్సు రెండో విడత కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా.. గర్భిణులకు ధనుర్వాతం రాకుండా ఉండేందుకు టీకాలు వేస్తామన్నారు. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు జరగబోయే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి అచ్యుతరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్‌వర్మ, సిబ్బంది చంద్రశేఖర్, సత్తిరాజు, ఆర్‌వీ రమణ, ఎం. సత్యవతి, రత్నకుమారి, వేదమణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా..?

• నగరంలో పలుచోట్ల తనిఖీ చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



రైల్వేస్టేషన్ రోడ్డులో డివైడర్ల నిర్వహణను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలో కుళాయిల నుంచి బురదనీరు వస్తోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్, స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్ర స్వామి నగరంలోని పలు ప్రాంతాలను సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ప్రధానంగా రైల్వేస్టేషన్ మార్గంలో పైప్‌లైన్లు పాడవ్వడాన్ని గుర్తించి, వెంటనే అధికారులను పిలిపించి తగు సూచనలు చేశారు. అధికారులు వచ్చేంతవరకు సుమారు అర గంట పాటు జెడ్పీ కార్యాలయం సమీపంలో రహదారి పక్కనే కూర్చున్నారు. పైప్‌లైన్లకు లీకేజీలు ఉండడం వల్ల నీరు కలుషితమవుతోందని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర సుందరీకరణ కోసం రైల్వేస్టేషన్ మార్గంలో డివైడర్ల వద్ద నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వనంగుడి ఎదురుగా దుకాణ సముదాయాల వద్ద కాలువ పైప్‌లైన్లు పగిలి మురుగునీరు రహదారిపైకి వస్తుండడంతో సంబంధిత అధికారులకు వెంటనే ఫోన్ చేసి మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్ వద్ద పెద్ద చెరువును పరిశీలించి తగు సూచనలు చేశారు. పెద్ద చెరువును ఆనుకొని ఆక్రమణలు చోటుచేసుకోవడంతో వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట నగర పాలక సంస్థ అధికారులు ఉన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం..



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ సముద్రపు రామారావు

• నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు

నెల్లిమర్ల: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో గల జరజాపుపేట శ్రీ వేంకటేశ్వర మురళీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత రాకుండా, పౌష్టికాహార లోపం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చిన్నారులకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. అనంతరం పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సీడీపీఓ ప్రసన్న మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, ఏఎంసీ డైరెక్టర్ పోలుబోతు నారాయణమూర్తి, కౌన్సిలర్స్ నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పొండ్రంకి సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు మాత సంధ్య, అవనాపు మురళీకృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రినాథ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో అభివృద్ధి

• ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు



కారు తాళాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు



ఎంబ్రాయిడరీ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు

డెంకాడ: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు ఆకాంక్షించారు. మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన తాలాడ అనురాధకు రూ.8 లక్షల విలువ చేసే కారును పీఎంఈజీపీ పథకంలో భాగంగా వైఎస్సార్‌క్రాంతి పథం, డీఆర్‌డీఏ అధికారులు ఏపీజీవీబీ సహకారంతో మంజూరు చేశారు. ఈ మేరకు లబ్ధిదారుకు సోమవారం కారు తాళాలు అందజేశారు. అలాగే పెదతాడివాడ గ్రామానికి చెందిన పోలిపల్లి లక్ష్మికి రూ.10 లక్షల 60 వేలు విలువ చేసే ఎంబ్రాయిడరీ, టైలరింగ్ మిషన్ యూనిట్‌ను మంజూరు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌క్రాంతి పథం ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎం విజయలక్ష్మి, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, పినతాడివాడ, పెదతాడివాడ ఎంపీటీసీ సభ్యులు విజినిగిరి అచ్చంనాయుడు, పొతపల్లి జగన్నాథరావు, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

• గ్రామీణ వైద్యుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి




రక్తదానం చేస్తున్న గ్రామీణ వైద్యులు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గ్రామీణ వైద్యుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. గ్రామీణ వైద్యుల సంఘ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక గ్రామీణ వైద్యుల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలమని తెలిపారు. గ్రామీణ వైద్యుల సంఘం 30 మందితో ప్రారంభించామని, ప్రస్తుతం 2 వేల మంది సభ్యులయ్యారని చెప్పారు. ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పైడిరాజు, కోశాధికారి ఉమాశంకర్, సుగణేశ్వరి, ఎ. త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు ఆపాలి

• కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

విజయనగరం పూల్‌బాగ్: ఆటో డ్రైవర్లపై పోలీసుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. శ్రీ కనకదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరం జిల్లా పోలీసులు ఆటోస్టాండ్లకు వెళ్లి 336 సెక్షన్ కింద ఆటో డ్రైవర్లపై బలవంతంగా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎ. జగన్‌మోహన్, ఆటో డ్రైవర్లు వి.లక్ష్మణరావు, పి.ఆనంద్, బి.రమణ, కె.రాంబాబు, కె.సురేష్, బి.అప్పలనాయుడు, ఎం.హరి, సీహెచ్ నాయుడు, బి. ఈశ్వరరావు, బి.సూరి, తదితరులు పాల్గొన్నారు.